# మక్తల్ పట్టణంలో విశ్వహిందూ పరిషత్ స్థాపన దివస్ మరియు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**మక్తల్, సెప్టెంబర్ 04, ప్రజా న్యూస్**



నారాయణపేట జిల్లా స్థానిక మక్కల్ పట్టణంలోని మక్తల్ ట్యాంక్ బండ్ నుండి చందాపూర్ వరకు ఇరువైపులా ఉన్న రోడ్డ నా గతంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ మార్గ్ గా నామకరణం చేయడం జరిగింది వాసవి మాత చౌరస్తా నేతాజీ మార్గ్ మరియు అంబేద్కర్ చౌరస్తా మరియు బాలగంగాధర్ తిలక్ మార్గ్ నందు ఓంకార ధ్వజ విష్కరణ చేయడం జరిగింది నారాయణపేట్ రోడ్డు నందు విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఘనంగా స్థాపన దివాస్ జరుపుకోవడం జరిగింది విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా శ్రీకృష్ణ జన్మాష్టమి నాడే విశ్వహిందూ పరిషత్ ని ఆవిర్భవించడం జరిగింది విశ్వహిందూ పరిషత్ అనేక కార్యక్రమాలు తీసుకొని హిందువులలో చైతన్యం చేస్తూ హిందూ జాగృతికి అహర్నిశలు శ్రమిస్తుందని విశ్వహిందూ పరిషత్ ప్రఖండ అధ్యక్షులు కే సత్యనారాయణ గౌడ్ అన్నారు రామ మందిరం అయోధ్య శ్రీకృష్ణ దేవాలయం తిరుమల తిరుపతి దేవాలయం రక్షణకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు కార్యక్రమంలో పాల్గొన్న వారు పట్టణ అధ్యక్షులు వాకిటి భీమన్న, పట్టణ గౌరవాధ్యక్షులు జుట్ల హనుమంతు, పట్టణ మల్లికార్జునరావు, బజరంగ్ దళ్ ప్రఖండ సంయోజక్ రాహుల్, పరుశరం, తదితరులు పాల్గొన్నారు

# శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవం

నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ 4వ వార్డులోని శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవాలు

**మక్తల్, సెప్టెంబర్ 04, ప్రజా న్యూస్**



శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవం సందర్భంగా ఈరోజు ఉదయం వల్లభపురం శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయం నుంచి జలబిందెలు,అడుగుల భజన కోలాటాలతో మక్తల్ పురవీధుల గుండా శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయం వరకు భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ మహోత్సవంలో 4వ వార్డు కౌన్సిలర్ పీకే నరసింహ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు కావలి శ్రీహరి, కోళ్ల వెంకటేష్ .డాక్టర్ శ్రీరాములు, కట్ట సురయ్య, కట్ట వెంకటేష్ కావలి ఆంజనేయులు, తిరుపతి నరసింహులు, మామిళ్ల కిష్టప్ప. గుంతల శ్రీనివాసులు ఆంజనేయులు. గుంతలు బాలరాజ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన పెన్షన్లు అందజేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**మేడ్చల్, సెప్టెంబర్ 4: ప్రజా న్యూస్**



ఎల్లంపేట్ మున్సిపల్ పరిధిలోని డబిల్‌పూర్ గ్రామంలో ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఆసరా పెన్షన్లను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ సంజీవరావు అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందజేశారు. ఈ సందర్భంగా సంజీవరావు మాట్లాడుతూ, వృద్ధాప్యంలో ఆసరా కోల్పోయిన పేదలకు నూతన పెన్షన్లు కొండంత భరోసానిస్తాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పెన్షన్లు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వానికి, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బావని వెంకటేష్ యాదవ్, మునిగొండ శేఖర్, బాలు ముదిరాజ్, సదానంద్, చింటూ, వరుణ్ ముదిరాజ్, వాలంటీర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గూడెం వాస్తవ్యుడి ఔదార్యం

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం

## పదివేల రూపాయల నగదు అందజేత

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 04 ప్రజా న్యూస్**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం జాలపెల్లి సత్తయ్య – మైసవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు ఒక కూతురు లు ఉన్నారు. జాలపెల్లి మైసమ్మ గత సంవత్సరం క్రితం మృతిచెందగా పెద్ద కుమారుడు మానసిక వికలాంగుడిగా మతిస్థిమితం సరిగా లేకుండా ఉండడంతో సత్తయ్య కుటుంబాన్ని పోషించుకుంటూ జీవించేవాడు. గత కొన్ని రోజుల క్రితం కుటుంబ పెద్దదిక్కు అయినా జాలపెల్లి సత్తయ్య మరణించగా ఇద్దరు కుమారులు అనాధలుగా మిగిలారు. వారి కుటుంబ దయనీయ పరిస్థితిని చూసి గూడెం గ్రామ వాస్తవ్యులు చిట్నేని మాధవి వెంకటేశ్వరరావు లు జాలపెల్లి సత్తయ్య కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. కుటుంబ పరిస్థితులను తెలుసుకున్న వెంకటేశ్వరరావు, చిట్నేని అంజన్ రావు, చిట్నేని శ్రీనివాసరావు లతో పదివేల రూపాయల నగదును సత్తయ్య కొడుకులు శంకర్,దేవరాజు లకు గ్రామ సర్పంచ్ సోమారపు శరవింద్ సమక్షంలో అందించారు. ఆ నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన వెంకటేశ్వరరావు కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.. ఇంకా ఎవరైనా మానవత దృక్పథంతో అనిరుపేద కుటుంబానికి తమకు తోచిన విధంగా ఆర్థిక సహాయాన్ని అందించాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఉల్లి దేవరాజు, గ్రామస్తులు మానుక కుమార్ యాదవ్ ,ఇప్ప రవిందర్ రెడ్డి, సిరిపురం రాజిరెడ్డి, మొగుళ్ళ గోపాల్, అందె సతీష్, చకినాల కృష్ణ , సోమారపు సుధాకర్, కర్రొల్ల ఆంజనేయులు, పాండవుల ప్రవీణ్, అంకం వెంకటేష్, జాలపెల్లి దేవయ్య, కదిరె రమేష్, కదిరె శ్రీనివాస్, కొత్తింటి ఎల్లారెడ్డి, అందె రాములు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# హామీలు కొండంత... అమలు శూన్యం

కాంగ్రెస్ 1000 రోజుల దగా పాలనపై మాజీ ఎమ్మెల్యే గండ్ర ధ్వజం

కాళేశ్వరం పంపులు వెంటనే నడిపించాలి

రైతుల పంటలకు సాగునీరు అందించాలి

మీడియాపై దాడులకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి గండ్ర వెంకట రమణారెడ్డి

**భూపాలపల్లి, చిట్యాల, సెప్టెంబర్ 4 ప్రజా న్యూస్**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ 1000 రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చిట్యాల మండల కేంద్రంలో మహిళలు, వృద్ధులు, వికలాంగులతో సదస్సు, వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డలు, వృద్ధులు, రైతులు, యువత, వికలాంగులు సహా అన్ని వర్గాల ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే 1000 రోజులు గడిచినా వాటిలో అనేక హామీలు అమలుకు నోచుకోలేదని మండిపడ్డారు. మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయం, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, వికలాంగులకు రూ.6 వేల పెన్షన్, రైతులకు రూ.15 వేల రైతు భరోసా, కళ్యాణలక్ష్మిషాదీముబారక్ కింద తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**6 గ్యారెంటీలు.. 420 హామీలు.. అమలు మాత్రం శూన్యం**

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల దగా పాలనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల ఆవేదనను ప్రతిబింబించేలా "6 గ్యారెంటీలు.. 420 హామీలు.. అమలు మాత్రం శూన్యం" అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే వాటిని తొలగిస్తున్నారని ఆరోపించారు. ఫ్లెక్సీలు తొలగించినంత మాత్రాన ప్రజల ఆలోచనలను, ఆవేదనను అణచివేయలేరని గండ్ర స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల గొంతును, ప్రజల సమస్యలను అణచివేయడం సరికాదన్నారు. పోలీసు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లోనై అతిగా వ్యవహరించవద్దని సూచించారు. తప్పుడు కేసులతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను భయపెట్టడం సాధ్యం కాదని, రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు.

**మీడియాపై దాడులు ప్రజాస్వామ్యానికి విరుద్ధం**

భూపాలపల్లి నియోజకవర్గంలో ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధంగా మీడియా ప్రతినిధులపై దాడులు జరుగుతున్నాయని గండ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మీడియాపై జరిగిన దాడి ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరామని తెలిపారు.

**కాళేశ్వరం పంపులు వెంటనే నడపాలి**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని, గతంలో విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడిన తెలంగాణ ప్రజలకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ప్రస్తుతం మళ్లీ విద్యుత్ కోతలు, సాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని విమర్శించారు. "ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదు.. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఏర్పడిన పరిస్థితి" అని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ ఆరోపణలతో కాలయాపన చేయకుండా రైతుల ప్రయోజనాల కోసం వెంటనే పంపులను నడిపించాలని డిమాండ్ చేశారు. గోదావరిలో నీరు ప్రవహిస్తున్నప్పటికీ పంపులను ఆన్ చేయకపోవడంతో రైతులు సాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. తాము అధికారంలో ఉన్న సమయంలో ఎండాకాలంలో సైతం చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించి పంటలను కాపాడిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని గుర్తు చేశారు. రైతులు ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడే వారు కాదని, కష్టపడి పంటలు పండించుకునే స్వభావం రైతులదని గండ్ర అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఎన్నికల హామీలను అమలు చేయడంతో పాటు, కాళేశ్వరం ప్రాజెక్టు పంపులను నడిపి రైతుల పంట పొలాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, వృద్ధులు, వికలాంగులతో పాటు చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలు, భూపాలపల్లి పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్య బాధితులకు సీఎం సహాయనిధి అండ

## -- రూ.14.17 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ ఎమ్మెల్యే జీఎస్సార్

**- భూపాలపల్లి, సెప్టెంబర్ 4 ప్రజా న్యూస్**

అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గణపురం, భూపాలపల్లి మండలాలకు చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కులను ఎమ్మెల్యే జీఎస్సార్ పంపిణీ చేశారు. గణపురం మండలానికి చెందిన 29 మంది లబ్ధిదారులకు రూ.7,13,600, భూపాలపల్లి మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు రూ.7,03,500 విలువైన చెక్కులను అందజేశారు. మొత్తంగా 60 మంది లబ్ధిదారులకు రూ.14,17,100 విలువైన ఆర్థిక సహాయం అందింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలు వైద్య చికిత్సల కోసం అప్పులపాలు కాకుండా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సీఎంఆర్ఎఫ్ సహాయం అవసరమైన అర్హులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని



సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే జీఎస్సార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో నియామక పత్రాలు అందజేత


**మేడ్చల్, సెప్టెంబర్ 4: ప్రజా న్యూస్**




తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల రాష్ట్ర అధ్యక్షులు బొక్క నరేంద్ర గారి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బహుజన నగర్ ఇన్‌చార్జిగా కె. హరి ని నియమించారు. ఈ సందర్భంగా మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి. కమలుద్దీన్, రాష్ట్ర ఇన్‌చార్జి టీ. సత్యనారాయణ, మీడియా మండల కోఆర్డినేటర్ గద్దం వెంకటేష్, టీ. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేటలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పిండ ప్రధానం బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 4 ప్రజా న్యూస్**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పిండ ప్రధానం చేసిన పలువురు బీఆర్ఎస్ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఎస్ ఐ ఎన్. రమేష్ తెలిపారు. అనుమతి లేకుండా నిరసన కార్యక్రమం నిర్వహించిన నేపథ్యంలో ఈ కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ ఎన్. రమేష్ మాట్లాడుతూ.. పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నెలరోజుల పాటు పోలీస్ అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్‌లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని తెలిపారు. అదే విధంగా పోలీసుల అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా డీజేలను వినియోగించరాదని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ హెచ్చరించారు. ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు పోలీసుల సూచనలు, నిబంధనలను పాటిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్ ఐ ఎన్. రమేష్ కోరారు. ఎల్లారెడ్డిపేటలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# లాల్ సింగ్ తండాలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

## శ్రీకృష్ణుని వేషధారణలో అలరించిన చిన్నారులు

**రాజన్న సిరిసిల్ల జిల్లా సెప్టెంబర్ 4 ప్రజా న్యూస్**

:రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం లాల్ సింగ్ తండా గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. తండాకు చెందిన చిన్నారులు శృష్టి రామ్ రాథోడ్, అశ్విక లు శ్రీకృష్ణుని వేషధారణలో అందరిని ఆకట్టుకున్నారు. శ్రీకృష్ణుని సాంప్రదాయ దుస్తులలో నృత్యాలు చేస్తూ అందరిని అబ్బురపరిచారు.

# పదేళ్లు అధికారంలో ఉండి ప్రజల్ని మోసం చేసిన బిఆర్ఎస్

## నేడు ప్రతిపక్షంలో ఉండి ధర్నాలు చేయడం విడ్డూరం..

## బీజేవైఎం ప్రధాన కార్యదర్శి మార్పు దయాకర్ రెడ్డి

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 4 ప్రజా న్యూస్**



పదేళ్లు తెలంగాణను పరిపాలించి ప్రజల్ని మోసం చేసిన బిఆర్ఎస్ నేడు ప్రతిపక్షంలో ఉండి ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి మార్పు దయాకర్ రెడ్డి అన్నారు.. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న ప్రజలు ఆనాటి టిఆర్ఎస్ పార్టీని అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే మొట్టమొదటిగా ముఖ్యమంత్రిని దళితుడిని చేస్తానని చెప్పిన కెసిఆర్ దళితులను మోసం చేశారని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎన్నో కలలుగన్న అన్ని వర్గాల ప్రజల ఆశలు నిర్వీర్యం చేసిన ఘనత ప్రస్తుత బిఆర్ఎస్ పార్టీదేనిని ఆయన దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజలను మోసగించి అవినీతి అరాచకాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందన్నారు. తెలంగాణ ఏర్పడినంక ఉద్యోగాలు వస్తాయన్న నిరుద్యోగుల ఆశలు అడియాశలు అయ్యాయని అన్నారు. తెలంగాణ ప్రజలకు బిఆర్ఎస్ పరిపాలన మీద విరక్తి చెంది వద్దురా నాయన ఈ పాలన అని ప్రజలు వాళ్ల పదవులను ఊడగొడితే ఈ రోజు సిగ్గు లేకుండా మళ్లీ రోడ్డు మీదకు వచ్చి ధర్నాలు నిరసనలు చేస్తుంటే వింతగా ఉందన్నారు. బిఆర్ఎస్ ఏ విధంగా అయితే ప్రజల్ని మోసం చేసిందో అదే ధోరణిలో కాంగ్రెస్ పార్టీ కూడా నడుస్తుందని ఎద్దేవా చేశారు. రెండు పార్టీల వైఖరి ఒకటే గనుక రానున్న రోజుల్లో ప్రజలు ఈ రెండు పార్టీలకు కచ్చితంగా బుద్ధి చెప్తారని జోష్యం చెప్పారు. చైతన్యవంతులైన తెలంగాణ ప్రజలు రెండు పార్టీల వైఖరిని గమనిస్తున్నారని కచ్చితంగా రాబోవు రోజుల్లో నరేంద్ర మోడీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చి కచ్చితంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని దయాకర్ రెడ్డి తెలిపారు.

# హరిదాస్ నగర్ లో ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పత్రాల పంపిణి

పాల్గొన్న గ్రామ సర్పంచ్ చిర్రం నాగరాజు యాదవ్, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు

**ఎల్లారెడ్డిపేట సెప్టెంబర్ 04 ప్రజా న్యూస్**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్ గ్రామములో ఇందిరమ్మ ఇండ్ల ప్రొసిడింగ్ పత్రాలను గ్రామ సర్పంచ్ చిర్రం నాగరాజు యాదవ్, ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యములో లబ్దిదారులకు అందజేశారు. గ్రామానికి చెందిన తిప్పరవేణి భాగ్య, రొడ్డ సరవ్వ, గద్దల భూమరాజవ్వ, వట్టెల లక్ష్మి, జక్కుల రాణి లకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాగరాజు యాదవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టినటువంటి ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేయబడతాయని అన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమములో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు గుర్కా పర్శరాముల, కాంగ్రెస్ నాయకులు వంగ మల్లారెడ్డి, రొడ్డ రామచంద్రం, ఉత్తెర్ల లక్ష్మణ్, వట్టెల రాములు, వట్టెల రవి, చీకట్ల నారాయణ, జక్కుల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# తాగుడుకు డబ్బులు ఇవ్వలేదని కన్నతల్లిని హత్య చేసిన కుమారుడు

రోకలిబండతో తలపై దాడి.. మఠంపల్లి మండలం రఘునాథపాలెంలో విషాదం

**(మఠంపల్లి మండలం), సెప్టెంబర్ 4, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి:**



సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం రఘునాథపాలెం గ్రామంలో తాగుడుకు డబ్బులు ఇవ్వలేదన్న కారణంతో కుమారుడు కన్నతల్లిని దారుణంగా హత్య చేసిన ఘటన శుక్రవారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన షేక్ సుభాని తాగుడుకు బానిసై తరచూ తన తల్లి షేక్ సైదాబీని మద్యం కోసం డబ్బులు అడుగుతూ వేధించేవాడని సమాచారం. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం తల్లితో డబ్బుల విషయంలో గొడవ జరగడంతో ఆగ్రహానికి గురైన సుభాని రోకలిబండతో తల్లి తలపై దాడి చేసినట్లు తెలుస్తోంది. తీవ్ర గాయాల కారణంగా సైదాబీ అక్కడికక్కడే మృతి చెందింది. సుభాని భార్య ఏడాది క్రితమే అతడిని విడిచి వెళ్లిపోవడంతో అప్పటి నుంచి తల్లితో కలిసి ఉంటున్నట్లు సమాచారం. తాగుడుకు బానిసైన కుమారుడి వేధింపులతో తల్లి ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు తెలిపారు. తల్లి మృతితో రఘునాథపాలెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి ఘటనకు దారితీసిన పరిస్థితులు, హత్యకు సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు చేపట్టారు.

# పుట్టపర్తి యాత్రలో ఇండస్ట్రియల్ కాలనీ భజన మండలి భక్తులు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 04 : ప్రజా న్యూస్ నెట్వర్క్, విశాఖపట్నం స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం. నాయుడు.**



మల్కాపురం ,పారిశ్రామిక ప్రాంతం 61వ వార్డులో శ్రీ సత్యసాయి భజన మండలి భక్తులు సెప్టెంబర్ 3,4,5 తారీకుల్లో పుట్టపర్తి లో కృష్ణాష్టమి సందర్భంగా విశాఖ జిల్లా పర్తియాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు, భజన మండలి కన్వీనర్ పి నూకరాజు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా విశాఖ జిల్లా పర్తి యాత్రకు అన్ని భజన మండలలో సమితిలో ఉన్న భక్తులు సుమారుగా 2500 మంది పాల్గొంటున్నారు, ఇందులో భాగంగా గాజువాక సమితిలో ఉన్న ఇండస్ట్రియల్ కాలనీ భజన మండలి నుండి భక్తులు పాల్గొని ఓంకారము, సుప్రభాత సేవ , వేద పఠనం , మహా నగర సంకీర్తన, కుంకుమ పూజలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్వామివారి చూపించిన.. నడిపించిన.. బాటలో అందరూ నడవాలని సేవలు ద్వారా మనల్ని మనం ఉద్ధరించుకోవాలి అని ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థాయికి ఎదగాలని స్వామివారిని ప్రార్థించారు, ఈ కార్యక్రమంలో సేవాదళ్ , భక్తులు , బాల వికాస్ పిల్లలు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ మేజర్ ఎడమ కాలువకు గండి.. నీట మునిగిన పంట పొలాలు

కరక్కాయలగూడెంలో చెరువులను తలపిస్తున్న పొలాలు..
నీటిపారుదల శాఖ అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం

**సూర్యాపేట జిల్లా, సెప్టెంబర్ 4, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి:**



సాగర్ మేజర్ ఎడమ కాలువకు గుర్తుతెలియని వ్యక్తులు గండి పెట్టడంతో కాలువలోని భారీగా నీరు పంట పొలాల్లోకి ప్రవేశించి రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కరక్కాయలగూడెం గ్రామ పరిధిలోని పలు పంట పొలాల్లోకి నీరు ఉధృతంగా చేరడంతో సాగు భూములు పూర్తిగా నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. ఇప్పటికే పంటలు నీటిలో మునిగిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు కోసం పెట్టుబడులు పెట్టి, పంట చేతికొచ్చే సమయంలో ఈ పరిస్థితి ఏర్పడటంతో తమ కష్టార్జితం నీటిపాలవుతోందని రైతులు వాపోతున్నారు. కాలువకు గండి పడిన ప్రాంతం నుంచి నీరు నిరంతరంగా పొలాల్లోకి చేరుతుండటంతో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోంది.

**గండి పడిన కాలువ.. పట్టించుకోని అధికారులు అంటూ రైతుల ఆగ్రహం:**

కాలువకు గండి పడిన విషయం తెలిసినప్పటికీ నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించడంలో జాప్యం చేస్తున్నారంటూ రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సాగర్ కాలువలపై నిరంతర పర్యవేక్షణ ఉండాల్సిన సమయంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం, గండి పడిన అనంతరం కూడా తక్షణ చర్యలు చేపట్టకపోవడంపై రైతులు ప్రశ్నిస్తున్నారు. నీరు పొలాల్లోకి చేరుతున్న కొద్దీ పంట నష్టం పెరిగే ప్రమాదం ఉందని, అధికారులు ఆలస్యం చేస్తే రైతులు మరింత భారీగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువకు గండి పెట్టిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవడంతో పాటు, గండిని వెంటనే పూడ్చి నీటి ప్రవాహాన్ని నియంత్రించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**పంట నష్టంపై తక్షణమే అంచనా వేయాలని డిమాండ్:**

కరక్కాయలగూడెం గ్రామ పరిధిలో నీటమునిగిన పంట పొలాలను సంబంధిత అధికారులు తక్షణమే పరిశీలించి వాస్తవ పరిస్థితిని నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు. పొలాల్లో నిలిచిన నీటిని వీలైనంత త్వరగా బయటకు మళ్లించే చర్యలు చేపట్టాలని, కాలువ గండిని శాశ్వతంగా పూడ్చి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. రైతుల పంటలు దెబ్బతిని ఆర్థికంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడితే బాధ్యత ఎవరిదనే ప్రశ్నలు కూడా స్థానికంగా వినిపిస్తున్నాయి. నీటిపారుదల శాఖ అధికారులు ఇకనైనా మొద్దునిద్ర వీడి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, కాలువకు మరమ్మతులు చేపట్టి రైతులకు మరింత నష్టం జరగకుండా అత్యవసర చర్యలు చేపట్టాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

# కేసుల దర్యాప్తులో జాప్యానికి తావులేదు

పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి.. వినాయక చవితికి పటిష్ట భద్రతా చర్యలు: ఎస్పీ నర్సింహ

**సూర్యాపేట జిల్లా, సెప్టెంబర్ 4, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి:**

సూర్యాపేట జిల్లా పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ నర్సింహ, ఐపీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమగ్ర సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, అట్రాసిటీ కేసులు, కేంద్ర ఫిర్యాదుల విభాగం ఫిర్యాదులు, నిర్ణీత గడువులో అభియోగపత్రాల దాఖలు, పోక్సో కేసుల దర్యాప్తు తదితర అంశాలపై ఎస్పీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసును నిర్లక్ష్యం లేకుండా పర్యవేక్షిస్తూ, దర్యాప్తును వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. బాధితులకు సకాలంలో న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన బాధ్యతగా ఉండాలని, కేసుల దర్యాప్తులో ఎలాంటి జాప్యం చోటుచేసుకోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**నాణ్యమైన దర్యాప్తుతోనే కేసులకు బలమైన ఆధారం:**

కేసుల దర్యాప్తులో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు. కేవలం కేసులు నమోదు చేయడమే కాకుండా, ప్రతి కేసులో సాక్ష్యాధారాలను పకడ్బందీగా సేకరించి, అవసరమైన పత్రాలను సక్రమంగా సిద్ధం చేసి, దర్యాప్తును నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. కోర్టు విచారణలో కేసులు బలంగా నిలిచేలా దర్యాప్తు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకుంటూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**పోక్సో కేసులపై అత్యంత ప్రాధాన్యత:**

పిల్లలకు సంబంధించిన పోక్సో కేసుల దర్యాప్తును అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని ఎస్పీ నర్సింహ అధికారులను ఆదేశించారు. బాధితులకు న్యాయం జరిగేలా చట్టపరమైన నిబంధనలను పూర్తిస్థాయిలో పాటిస్తూ దర్యాప్తును వేగవంతం చేయాలని, సాక్ష్యాధారాల సేకరణలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులో అభియోగపత్రాలు దాఖలు చేసి, కేసుల విచారణ వేగంగా జరిగేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని స్పష్టం చేశారు.

**వినాయక చవితికి ముందస్తు భద్రతా చర్యలు:**

రానున్న వినాయక చవితి ఉత్సవాలు, వినాయక విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా ముందస్తు భద్రతా ప్రణాళిక సిద్ధం చేయాలని ఎస్పీ ఆదేశించారు. ముఖ్య పట్టణాల్లో నిమజ్జన ప్రదేశాలను ముందుగానే గుర్తించి, పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ మ్యాప్, పార్కింగ్, ప్రజల రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. ఉత్సవ నిర్వాహకులతో ముందుగానే సమన్వయం చేసుకుని నిబంధనలపై అవగాహన కల్పించాలని, మండపాల వద్ద విద్యుత్ భద్రతతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు



కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**ప్రజలకు అందుబాటులో పోలీసు సేవలు:**

శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రతి పౌరుడికి పోలీసు సేవలు అందుబాటులో ఉండేలా అధికారులు పనిచేయాలని ఎస్పీ సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్లక్ష్యం చేయకుండా స్పందించి, సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తు, కోర్టు కేసుల పరిష్కారం, ఉత్సవాల భద్రత వంటి అన్ని అంశాల్లో అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పోలీసు శాఖపై ప్రజల్లో మరింత నమ్మకం పెంచేలా విధులు నిర్వహించాలని ఎస్పీ నర్సింహ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, ప్రత్యేక విభాగం ఇన్‌స్పెక్టర్ రామారావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, పోలీసు సాంకేతిక, సమాచార సిబ్బంది పాల్గొన్నారు.

# బుల్లెట్ రైలు కోసం సద్దల చెరువులో అఖిలపక్షం జలదీక్ష

అలైన్‌మెంట్ మార్చకుండా యథావిధిగా కొనసాగించాలి.. కేంద్ర ప్రభుత్వానికి గట్టి డిమాండ్

**సూర్యాపేట జిల్లా, సెప్టెంబర్ 4, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి:**

సూర్యాపేట ప్రాంతం మీదుగా బుల్లెట్ రైలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ రోజురోజుకు ఉధృతమవుతోంది. శంషాబాద్ నుంచి సూర్యాపేట మీదుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బుల్లెట్ రైలు మార్గం అలైన్‌మెంట్‌ను ఎలాంటి మార్పులు చేయకుండా యథావిధిగా కొనసాగించాలని కోరుతూ శుక్రవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో సద్దల చెరువులోకి దిగి జలదీక్ష చేపట్టారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు జలదీక్షలో పాల్గొని సూర్యాపేట మీదుగా బుల్లెట్ రైలు మార్గాన్ని కొనసాగించాలంటూ నినాదాలు చేశారు. సూర్యాపేట ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వే సౌకర్యాన్ని కల్పించడంలో భాగంగా బుల్లెట్ రైలు ప్రాజెక్టు ఎంతో కీలకమని నాయకులు పేర్కొన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మార్గాన్ని మార్చడం వల్ల సూర్యాపేట జిల్లా ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**సూర్యాపేట మీదుగా బుల్లెట్ రైలు తప్పనిసరిగా నడపాలి**

సూర్యాపేట జిల్లా కేంద్రానికి ఇప్పటికీ నేరుగా రైల్వే మార్గం లేకపోవడంతో జిల్లా ప్రజలు రైలు ప్రయాణాల కోసం ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉందని అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ రైలు మార్గం ఏర్పాటు అయితే జిల్లా ప్రజలకు వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రావడంతో పాటు సూర్యాపేట పట్టణం, పరిసర ప్రాంతాల అభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, రోగులు, సాధారణ ప్రయాణికులకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు వాణిజ్య కార్యకలాపాలు విస్తరించే అవకాశం ఉంటుందని అన్నారు. జిల్లాలో పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, వైద్య రంగం అభివృద్ధి చెందేందుకు కూడా మెరుగైన రవాణా వ్యవస్థ దోహదపడుతుందని పేర్కొన్నారు.

**అలైన్‌మెంట్ మార్పును వెంటనే వెనక్కి తీసుకోవాలి :**

సూర్యాపేట మీదుగా బుల్లెట్ రైలు వస్తుందని ఆశించిన జిల్లా ప్రజలకు అలైన్‌మెంట్ మార్పు నిరాశ కలిగించిందని అఖిలపక్ష నాయకులు అన్నారు. మొదట ప్రకటించిన మార్గాన్ని కొనసాగించకుండా మార్పులు చేయడం వల్ల సూర్యాపేట ప్రాంతానికి దక్కాల్సిన భారీ రవాణా సౌకర్యం దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను, జిల్లా భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం బుల్లెట్ రైలు మార్గంపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని గతంలో ప్రకటించిన అలైన్‌మెంట్ ప్రకారమే బుల్లెట్ రైలు మార్గాన్ని కొనసాగించాలని స్పష్టం చేశారు.

**ప్రజా ఉద్యమంగా మారుతున్న రైల్వే సాధన పోరాటం :**

బుల్లెట్ రైలు సాధన కోసం జరుగుతున్న పోరాటం కేవలం రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం కాదని, ఇది సూర్యాపేట జిల్లా ప్రజల భవిష్యత్ అవసరాలకు సంబంధించిన ఉద్యమమని నాయకులు పేర్కొన్నారు. అందుకే పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. జలదీక్ష ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తమ డిమాండ్‌ను స్పష్టంగా



తెలియజేశామని, సూర్యాపేట మీదుగా బుల్లెట్ రైలు మార్గం కొనసాగించే వరకు ఉద్యమాన్ని వివిధ రూపాల్లో కొనసాగిస్తామని తెలిపారు.

**కేంద్రం వెంటనే నిర్ణయం తీసుకోవాలి :**

సూర్యాపేట జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షను కేంద్ర ప్రభుత్వం గుర్తించి వెంటనే స్పందించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. అలైన్‌మెంట్‌ను మార్చకుండా మొదట ప్రకటించిన మార్గం ప్రకారం శంషాబాద్ నుంచి సూర్యాపేట మీదుగా బుల్లెట్ రైలు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. సూర్యాపేట జిల్లా అభివృద్ధికి ఉపయోగపడే ఈ కీలక రవాణా ప్రాజెక్టును రాజకీయాలకు అతీతంగా పరిశీలించి, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలని వారు స్పష్టం చేశారు. సద్దల చెరువులో చేపట్టిన జలదీక్షతో బుల్లెట్ రైలు సాధన ఉద్యమానికి మరింత ఊపు వచ్చిందని, రాబోయే రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అఖిలపక్ష నాయకులు తెలిపారు.

# సలీం షరీఫ్‌కు రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయ పురస్కారం

మూడు దశాబ్దాల అంకితభావానికి అరుదైన గౌరవం.. విద్యార్థుల విజయాలతో కోదాడ పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు

**(కోదాడ మండలం), సెప్టెంబర్ 4, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి:**

విద్యారంగంలో దాదాపు మూడు దశాబ్దాలుగా అంకితభావంతో సేవలందిస్తూ విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాల అభివృద్ధి, సమాజ భాగస్వామ్యం, పర్యావరణ పరిరక్షణలో విశిష్ట కృషి చేసిన పీఎం శ్రీ జెడ్పీ హైస్కూల్, కోదాడ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ సలీం షరీఫ్‌కు రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయ పురస్కారం లభించింది. 1996 నవంబర్ 27న ప్రభుత్వ సేవలో చేరిన ఆయన ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా, ఎంఈఓగా వివిధ బాధ్యతలు నిర్వర్తిస్తూ విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల పెంపు, పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. ఆయన నాయకత్వంలో పాఠశాల విద్యా ఫలితాల్లో విశేష పురోగతి సాధించింది. 202425లో 88 శాతం పదో తరగతి ఫలితాలతో పాటు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏడుగురు విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించగా, ఒక విద్యార్థి 571 మార్కులతో జిల్లా పరిషత్ పాఠశాలల టాపర్‌గా నిలిచాడు. 202526లో పాఠశాల 99 శాతం పదో తరగతి ఫలితాలు సాధించడంతో పాటు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో 100 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఈ ఏడాది 15 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించగా, 572 మార్కులు సాధించిన విద్యార్థి కోదాడ డివిజన్ టాపర్‌గా నిలిచాడు.

**పోటీ పరీక్షల్లోనూ విద్యార్థుల విజయాలు :**

పోటీ పరీక్షల్లోనూ విద్యార్థులు రాణించేలా సలీం షరీఫ్ ప్రత్యేక ప్రోత్సాహం అందించారు. 2025లో ముగ్గురు, 2026లో నలుగురు విద్యార్థులు జాతీయ ప్రతిభా ఆధారిత ఉపకార వేతనాలు సాధించారు. 2025లో ఒకరు, 2026లో ముగ్గురు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఇంటింటి ప్రచారం, బడిబాట, చదువుల పండుగ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల నమోదు, పాఠశాలలో నిలుపుదలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో ప్రతి సంవత్సరం పాఠశాలలో కొత్తగా చేరే విద్యార్థుల సంఖ్య కనీసం 155కు చేరడంతో పాటు డ్రాప్‌అవుట్ లేకుండా చర్యలు చేపట్టారు. తక్కువ ఖర్చు లేదా ఖర్చులేని బోధనా పద్ధతులు, ఆడియోవిజువల్ అభ్యసనం, ప్రత్యేక సహాయక బోధనతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సహపాఠ్య కార్యక్రమాలను ప్రోత్సహించారు. దాతలు, పూర్వ విద్యార్థులు, సమాజ సహకారంతో పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేశారు.

**మూడు దశాబ్దాల సేవలకు రాష్ట్రస్థాయి గుర్తింపు :**

విద్యా రంగంలో సలీం షరీఫ్ అందించిన సేవలకు ఇప్పటికే పలు పురస్కారాలు లభించాయి. 2002లో మండల ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 2007లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 2017, 2023లో ఉత్తమ ఎంఈఓ పురస్కారాలతో పాటు 2025లో జిల్లా ఉత్తమ పాఠశాల పురస్కారం ఆయన సేవలకు గుర్తింపుగా దక్కాయి. తాజాగా రాష్ట్ర ఉత్తమ ప్రధానోపాధ్యాయ పురస్కారం లభించడం మూడు దశాబ్దాల విద్యా సేవలకు దక్కిన అరుదైన గౌరవంగా నిలిచింది. విద్యార్థుల విజయాలు, పాఠశాల అభివృద్ధి,



సమాజ భాగస్వామ్యాన్ని సమన్వయం చేస్తూ ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేసిన సలీం షరీఫ్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం లభించడం కోదాడ విద్యారంగానికి గర్వకారణంగా నిలిచింది.

## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

**(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ తేదీ.. 04.09.2026**




ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ విమర్శించారు. హామీల అమలును డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నిరసన ధర్నా నిర్వహించింది.వృద్ధులకు నెలకు రూ.4,000 పింఛన్, మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయం, వికలాంగులకు రూ.6,000 పింఛన్ ఇస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటగా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని విమర్శించారు.కేసీఆర్ అసెంబ్లీకి వస్తే సీఎం రేవంత్‌రెడ్డి తట్టుకోలేరని, హరీశ్‌రావు, కేటీఆర్ సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటేనే మంత్రులు సమాధానం చెప్పలేక తడబడుతున్నారని ఎద్దేవా చేశారు. హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని చింతా ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మామిళ్ళ రాజేందర్ రెడ్డి, పట్నం మాణిక్యం, డాక్టర్ శ్రీహరి, మందుల వరలక్ష్మి, జుబేదా, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అంబికా ఫంక్షన్ హాల్ యాజమాన్యం విజ్ఞప్తి..

**(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ తేదీ..04.09.2026..**



సంగారెడ్డి మండలం ఇస్మాయిల్ ఖాన్‌పేట్ గ్రామపంచాయతీ పరిధిలోని అంబికా ఫంక్షన్ హాల్ వద్ద డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఫంక్షన్ హాల్ యాజమాన్యం కోరుతోంది.అంబికా ఫంక్షన్ హాల్ యాజమాని కొలగల్ల నర్సింలు మాట్లాడుతూ.. తన ఫంక్షన్ హాల్ గోడ పక్కన ఉన్న డ్రైనేజీ సమస్యపై పలుమార్లు గ్రామపంచాయతీ అధికారులకు, కార్యదర్శికి, గ్రామ సర్పంచ్‌కు, సంబంధిత వార్డు మెంబర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు నిలిచిపోయి ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు సమస్యను పరిశీలించి, డ్రైనేజీ వ్యవస్థను సరిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే సమస్యను పరిష్కరించాలని గ్రామపంచాయతీ కార్యదర్శి, సర్పంచ్, వార్డు మెంబర్‌ను అంబికా ఫంక్షన్ హాల్ యాజమాన్యం విజ్ఞప్తి చేసింది..

## టి వై జె ఎఫ్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా చెల్మెడ అనిల్ కుమార్ నియామకం

సంగారెడ్డి: తెలంగాణ యూత్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టి వై జె ఎఫ్) రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా చెల్మెడ అనిల్ కుమార్ నియమితులయ్యారు..

**(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ తేదీ..04.09.2026**



టి వై జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు లిడా. తనుగుల జితేందర్ రావులి ఆదేశాల మేరకు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లిషేక్ మెహబూబ్‌లి ఆధ్వర్యంలో చెల్మెడ అనిల్ కుమార్‌ను రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, యువ జర్నలిస్టుల సంక్షేమం కోసం టి వై జె ఎఫ్ మరింత బలోపేతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఫెడరేషన్ అభివృద్ధికి కృషి చేయాలని చెల్మెడ అనిల్ కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో లిటి వై జె ఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కామగల్ల నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ కుమార్ గుప్తా, పట్టణ ఉపాధ్యక్షులు మహేందర్‌లి తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

సంగారెడ్డి: సంగారెడ్డి పట్టణంలోని గణేష్‌నగర్‌లో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

**(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ తేదీ 04.09.2026**




జన్మాష్టమి సందర్భంగా సంగారెడ్డి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి శ్రీకృష్ణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు స్వామివారి ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జన్మాష్టమి వేడుకల్లో భాగంగా పలువురు ప్రముఖులు ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

## లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు అందజేసిన తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి

**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 4 ప్రజా న్యూస్ నెట్వర్క్**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి దుండిగల్ సర్కిల్ 294 డివిజన్ డబుల్ బెడ్ రూమ్స్,డి.పోచంపల్లికి చెందిన పలువురు పేద ప్రజలు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఖర్చులకు సరిపడా ఆర్థిక స్థోమత లేక వివిధ సమస్యలను ఎదుర్కొంటు వారు రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డిని సంప్రదించగా,ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయం మంజూరు చేయించారు.అనంతరం శుక్రవారం బొంగునూరి కిషోర్ రెడ్డి ఆయన కార్యాలయం నందు లబ్ధిదారులు గశీడిమైస్సమ్మ అబ్దుల్ రెహమాన్ డి.పోచంపల్లి ఉమాకాంత్ కి (పంతులు) వారి చేతుల మీదగా సీఎం ఆర్ ఎఫ్ మంజూరి పత్రాలు చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రోటోకాల్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో నర్సింహా రెడ్డి, గంట శివారెడ్డి, లింగం గౌడ్, తిరుపతి రెడ్డి, కృష్ణ, మహేష్,టీమ్ బికెర్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మకూర్ (ఎస్) పీహెచ్‌సీలో సుఖప్రసవం మగబిడ్డకు జన్మనిచ్చిన మహిళ.. వైద్యాధికారి డాక్టర్ రమ్య, సిబ్బందిపై ప్రశంసలు

**ఆత్మకూర్ (ఎస్) మండలం, సెప్టెంబర్ 4, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి:**



సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలు విజయవంతంగా నిర్వహిస్తూ మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని స్థానికులు ప్రశంసిస్తున్నారు. శుక్రవారం పీహెచ్‌సీలో వైద్యాధికారి డాక్టర్ రమ్య నేతృత్వంలో ఓ మహిళకు సురక్షితంగా సాధారణ ప్రసవం నిర్వహించగా, ఆమె ఆరోగ్యవంతమైన మగబిడ్డకు జన్మనిచ్చింది. గర్భిణులకు సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన వైద్య సేవలను అందించడంలో డాక్టర్ రమ్య ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. సకాలంలో వైద్య పర్యవేక్షణ, నర్సింగ్ సేవలు, ఆరోగ్య సిబ్బంది సహకారంతో ప్రసవాన్ని విజయవంతంగా నిర్వహించడంతో మహిళ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్య సిబ్బంది గర్భిణులకు సూచిస్తున్నారు. ఈ సుఖప్రసవంలో వైద్యాధికారి డాక్టర్ రమ్య, నర్సింగ్ ఆఫీసర్ మానస, ఓపీ ఏఎన్‌ఎం మహబూబా, ఆత్మకూర్ ఏఎన్‌ఎం అన్నపూర్ణ, ఆశా వర్కర్ మాధవి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ యాదగిరి, హెల్త్ అసిస్టెంట్ రాజేంద్ర ప్రసాద్ పాల్గొని వైద్య సేవలు అందించారు. వైద్యురాలు డాక్టర్ రమ్యతో పాటు మొత్తం సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రసవాన్ని విజయవంతంగా నిర్వహించడంపై రోగి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు.

## బుల్లెట్ రైలు దీక్షకు ఉమ్మడి నల్గొండ జిల్లా క్రైస్తవ సంఘాల మద్దతు

జాతీయ రహదారి65కు సమాంతరంగా రైల్వే కారిడార్ ఏర్పాటు చేయాలి: బిషప్ దుర్గం ప్రభాకర్

**సూర్యాపేట జిల్లా, సెప్టెంబర్ 4, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి:**





సూర్యాపేట పట్టణంలోని బతుకమ్మ చౌరస్తాలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ రహదారి65కు సమాంతరంగా బుల్లెట్ రైలు, రైల్వే కారిడార్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షకు ఉమ్మడి నల్గొండ జిల్లా క్రైస్తవ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత, బిషప్ దుర్గం ప్రభాకర్ దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో రైల్వే వ్యవస్థ ప్రారంభమైన నాటి నుంచి దేశ అభివృద్ధిలో రైల్వేలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే సూర్యాపేట జిల్లా కేంద్రానికి ఇప్పటికీ రైల్వే మార్గం లేకపోవడం వల్ల జిల్లా ప్రజలు రైలు ప్రయాణం కోసం హైదరాబాద్, నల్గొండ, ఖమ్మం, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, జనగాం, వరంగల్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రానికి రైల్వే మార్గం తీసుకురావడంలో రాజకీయ నాయకుల వైఫల్యం ఉందని ఆయన విమర్శించారు. రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటానికి పార్టీలకు అతీతంగా ప్రజల మద్దతు రోజురోజుకు పెరుగుతోందని, ఈ ఉద్యమానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ రైలు తీసుకురావడానికి మొదట ప్రతిపాదించిన మార్గాన్నే కొనసాగించాలని, కొండమల్లేపల్లిహాలియాసాగర్ వైపు మార్గాన్ని మార్చడం అన్యాయమని అన్నారు. మొదట ప్రకటించిన మార్గం ప్రకారం హైదరాబాద్, చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ మీదుగా విజయవాడ, చెన్నై వైపు బుల్లెట్ రైలు నడపాలని డిమాండ్ చేశారు. ఈ మార్గం ఏర్పాటైతే సూర్యాపేట జిల్లాలో విద్య, వైద్యం, వ్యాపార వాణిజ్యం, ఉపాధి అవకాశాలు, రవాణా రంగాల్లో గణనీయమైన అభివృద్ధికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా ప్రజల దీర్ఘకాలిక రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖ తక్షణమే స్పందించి రైల్వే మార్గం, బుల్లెట్ రైలు సాధనకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్. శ్యామ్ ప్రసాద్, ముల్లంగి జాకబ్ రాజు, జలగం జేమ్స్, చింత మనిషే, పి. మార్క్, కొండేటి లాజర్, ఎం. రూబెన్, పంది మార్క్, కొమ్ము హోసన్నా, మామిడి క్రిస్టోఫర్, పిట్టల సామేలు, రెంటాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రెడీమిక్స్ కార్మికునికి రావలసిన వేతనం ఇప్పించిన

- బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి

**కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 4 ప్రజా న్యూస్ నెట్వర్క్**




గచ్చిబౌలి ఇండస్ట్రీ ఏరియా లో రెడీమిక్స్ కంపెనీలో కార్మికుడు దిగంబర్ గత రెండు సంవత్సరాల నుంచి పనిచేయడం జరుగుతుంది... కార్మికునికి రెండు నెలల వేతనం ఇవ్వకుండా రెడీమిక్స్ కంపెనీ ఓనర్ ఇబ్బంది పెట్టడం జరిగింది.. .రెడీమిక్స్ ఆ కార్మికునికి గత రెండు నెలల వేతనం మొత్తం మూడు నెలల, వేత్తనం రావాల్సి ఉండగా డబ్బులు ఇవ్వకుండా, ఏదో రకంగా నిర్లక్ష్యం చేస్తూ కార్మికుడు దిగంబర్ నీ ఇబ్బంది పెడుతూ పంపించేవాడు, ఆ కార్మికునికి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారో అని తోటి డ్రైవర్ల ద్వారా తెలుసుకొని బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి అతని గురించి తెలుసుకొని రవి కార్యాలయం వద్దకు వెళ్లి కార్మికునికి జరిగిన అన్యాయం చెప్పుకున్నారు.. ఆ తర్వాత వెంటనే స్పందించిన, రవి హుటాహుటిన,రెడీమిక్స్ కంపెనీ వద్దకు వెళ్లి కార్మికునికి రావలసిన వేతనం గురించి పలుమార్లు చర్చించి, రెండు నెలల వేతనం ఇప్పించడం జరిగింది... కార్మికుడు దిగంబర్ మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవి కి మా తరపున, మా కుటుంబ సభ్యుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు... ఈ కార్యక్రమంలో సంతోష్ గౌడ్, జగన్, సుదర్శన్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు..

## ముత్యాలమ్మ జాతర వేళ హుజూర్‌నగర్ పట్టణం జిగేల్‌మంటోంది

పనిచేయని వీధి దీపాల స్థానంలో కొత్త లైట్లు.. పట్టణమంతా వెలుగులతో కళకళ

**(హుజూర్‌నగర్ మండలం), సెప్టెంబర్ 4, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి:**



ముత్యాలమ్మ జాతరను పురస్కరించుకుని హుజూర్‌నగర్ పట్టణంలో వీధి దీపాల మరమ్మతులు, కొత్త లైట్ల ఏర్పాటు పనులను మున్సిపల్ అధికారులు వేగవంతం చేశారు. పట్టణంలోని లింగగిరి రోడ్డు నుంచి శ్రీ లక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్ వరకు, కోదాడ రోడ్డుతో పాటు ఇందిరా చౌక్ నుంచి మిర్యాలగూడ రోడ్డులోని రైస్‌మిల్ వరకు పనిచేయని వీధి దీపాలను గుర్తించి మరమ్మతులు చేపట్టారు. మరమ్మతులకు వీలుకాని లైట్ల స్థానంలో కొత్త లైట్లను ఏర్పాటు చేసి ప్రధాన రహదారులు, జాతర జరిగే ప్రాంతాలు రాత్రివేళల్లో కూడా వెలుగులతో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

**జాతర సందర్భంగా పట్టణానికి ప్రత్యేక వెలుగుల అలంకరణ:**

ముత్యాలమ్మ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో రహదారుల్లో చీకటి లేకుండా ప్రత్యేక దృష్టి సారించారు. పనిచేయని దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంతో ప్రధాన రహదారులు వెలుగులతో మెరిసిపోతున్నాయి. దీంతో భక్తులు, పట్టణ ప్రజలు రాత్రివేళల్లో రాకపోకలు సాగించేందుకు సౌకర్యంగా మారిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు, సిబ్బందికి అభినందనలు :**

పట్టణంలో వీధి దీపాల సమస్యను గుర్తించి జాతరకు ముందుగానే చర్యలు చేపట్టిన మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ సతీష్‌తో పాటు పనులు చేపట్టిన కాంట్రాక్టర్, విద్యుత్ అధికారులు, విద్యుత్ సిబ్బందికి పట్టణ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. జాతర సమయంలో పట్టణమంతా వెలుగులతో నిండేలా సమన్వయంతో పనిచేసిన అధికారుల చర్యలను ప్రజలు అభినందించారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు...


**విశాఖపట్నం , సెప్టెంబర్ 04 : ప్రజా న్యూస్ నెట్వర్క్, విశాఖపట్నం,స్టాఫ్ రిపోర్టర్, పీ.ఎం నాయుడు.**



విశాఖ నగరంలోని పలు ప్రాంతాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం యువత ఉత్సాహంగా నిర్వహించిన ఉట్లోత్సవంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో 62వ వార్డు అధ్యక్షులు మజ్జి మాలి నాయుడు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు....

## తోటి డ్రైవర్ కుటుంబానికి జై శ్రీరామ్ ఆటో యూనియన్ ఆర్థిక చేయూత

**గుర్రంపోడు, (ప్రజా న్యూస్ నెట్వర్క్ రిపోర్టర్ దోటి.శ్రీను)సెప్టెంబర్ 4,**



గుర్రంపోడు మండల పరిధిలోని పిట్టలగూడెం గ్రామానికి చెందిన డ్రైవర్ బైరి గిరి హఠాన్మరణం చెందడంతో ఆ కుటుంబానికి తోటి డ్రైవర్లు అండగా నిలిచారు. జై శ్రీరామ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులందరూ కలిసి గొప్ప మానవత్వాన్ని చాటుకుంటూ బాధిత కుటుంబానికి రూ. 10,000/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు.వృత్తిరీత్యా డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న బైరి గిరి ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబం ఒక్కసారిగా పెద్ద దిక్కును కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. ఈ విషాదకర పరిస్థితులను గమనించిన జై శ్రీరామ్ ఆటో యూనియన్ సభ్యులు స్పందించారు. తోటి డ్రైవర్ కుటుంబం పట్ల తమ సామాజిక బాధ్యతను చాటుకుంటూ యూనియన్ సభ్యులంతా స్వచ్ఛందంగా విరాళాలు సేకరించారు.ఈ క్రమంలో సేకరించిన నగదును బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి, ఈ కష్ట సమయంలో తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆపదలో ఉన్న తోటి డ్రైవర్ కుటుంబాన్ని ఆదుకోవడానికి జై శ్రీరామ్ ఆటో యూనియన్ సభ్యులు చూపిన ఈ చొరవను గ్రామస్థులు, తోటి వాహనదారులు, స్థానికులు ప్రశంసించారు. ఈ సందర్భంగా గిరి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.